క్లుప్తంగా

నేడు పెదపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

నాగాయలంక: ఏటిమొగ సచివాలయం పరిధిలోని పెదపాలెం గ్రామంలో బుధవారం ఉదయం ఏడు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పాల్గొని ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి

మోపిదేవి: మండలంలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయిందని ఎంఈఓ కె. రాజ్‌కుమార్ తెలిపారు. మోపిదేవి మండలం నుంచి 26 మంది ఇతర ప్రాంతాలకు బదిలీకాగా, ఇతర ప్రాంతాల నుంచి 28 మంది ఉపాధ్యాయులు మోపిదేవి మండలానికి వచ్చారని చెప్పారు. బదిలీల ప్రక్రియ పూర్తికావడంతో ఉపాధ్యాయులంతా విధుల్లో చేరారని ఎంఈఓ వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన



పెడన: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ సూర్య నారాయణ మంగళవారం పరిశీలించారు. నందిగామలో జరుగుతున్న భూదేవికోడు కాలువ మెరక తవ్వకం పనులను, హాజరైన కూలీలు, అటెండెన్సును పరిశీలించారు. వేసవి సందర్భంగా పనిప్రాంతాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. మండలంలో ఎంతమంది ఉపాధి కూలీలు ఉన్నారు.. ప్రస్తుతం ఎన్ని పనులు జరుగుతున్నాయనే దానిపై ఏపీఓ ముత్యాలును అడిగి తెలుసుకున్నారు. ఏపీఓ ముత్యాలు మాట్లాడుతూ ప్రస్తుతం 81 పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, వేసవి దృష్ట్యా ప్రథమ చికిత్స కిట్‌తో పాటు తాగునీటి సౌకర్యం కల్పించామని చెప్పారు. మండలంలో సుమారు మూడు వేల మంది వరకు జాబ్ కార్డులు కలిగి ఉన్నవారు ఉపాధి పనులకు హాజరవుతున్నారని వివరించారు. ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈసీ నజీర్‌అహ్మద్, కిషోర్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. నాగాయలంకకు చెందిన దేవరబోయిన రామారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రమేష్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గొరిపర్తి రవి కాంత్ యాదవ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కొలుసు శివరాజేష్, గొరిపర్తి గోపీ, రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని రుస్తుంబాద మునిసిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు టేబుల్, కుర్చీని మంగళవారం అందజేశారు. 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు టేబుల్‌ను ప్రధానోపాధ్యాయుడు ఎ. శ్రీనివాసరావుకు అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గూడూరు ఈఓపీఆర్డీ రాజేశ్వరి బాధ్యతల స్వీకారం

గూడూరు: గూడూరు మండల పంచాయతీ రాజ్ విస్తరణ, గ్రామీణాభివృద్ధి అధికారిగా పి.రాజేశ్వరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా బంటుమిల్లి మండలం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న పి.రాజేశ్వరి గూడూరు మండలానికి బదిలీపై వచ్చారు. గూడూరు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా వ్యవహరిస్తున్న టీవీవీ భాస్కర రావు నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు.

పోలీసు స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన

మండవల్లి: మండవల్లిలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన పూడిక పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), సీఐ వైవీఎల్ఎల్ నాయుడుతో కలిసి మంగళవారం పరిశీలించారు. పనుల వివరాలను సీఐ నాయుడు, ఎస్సై రామకృష్ణ ఎమ్మెల్యే డీఎన్నార్‌కు వివరించారు. నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ మెండా ఝాన్సి, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మన విద్యా విధానం దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా విధానం దేశానికే ఆదర్శమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలు అవుతున్న విద్యా విధానాన్ని విదేశీయులు సైతం ప్రశంసిస్తున్నారని చెప్పారు. నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, విద్యా, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, ట్యాబ్స్ పంపిణీ తదితర కార్యక్రమాలు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకురానున్నాయని వివరించారు. అవనిగడ్డ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించడం దివి సీమకు గర్వకారణమన్నారు. అవనిగడ్డ హైస్కూల్‌లో 860 మంది విద్యార్థులు ఉన్నారని, రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లులేవనే బోర్డులు దర్శనమిచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంఈఓ ఎస్. శివశంకరరావు, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులతో బంగారు భవిష్యత్..

పెడన: పేద పిల్లలకు ప్రభుత్వ బడుల్లో బంగారు భవిష్యత్తు ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి అన్నారు. మంగళవారం ఆమె బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ రాజులపాటి వాణితో కలిసి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే బాధ్యత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని, ఆ బాధ్యతలకు గౌరవం తీసుకువచ్చేలా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎంపీపీ వాణి మాట్లాడుతూ నిరుపేద బాలబాలికలకు పౌష్టికాహారం అందించేందుకు జగనన్న గోరుముద్దలో పలు రకాల పదార్థాలను ఇష్టంగా తినేలా మెనూ రూపొందించి అమలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా రాగీ జావను కూడా అందిస్తున్నారన్నారు. ఇన్‌చార్జి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ రూతమ్మ, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగబాబు, పామర్తి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. పెనుమల్లి జెడ్పీ హైస్కూల్‌లో కూడా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి..

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, గోకవరం సొసైటీ అధ్యక్షుడు గడిదేసి పెద వెంకయ్య అన్నారు. మండల పరిధి పెదపట్నం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పెద వెంకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. విద్యాపరంగా అవసరమైన సకల వసతులను కల్పించి పిల్లల విద్యాభివృద్ధికి బాటలు వేశారని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్ది విద్యార్థులకు ఉన్నతమైన విద్యా బోధన అందేలా చూస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పిల్లల తల్లిదండ్రులు ఎంతో రుణపడి ఉంటారన్నారు. సర్పంచి గడిదేసి అనూష మాట్లాడుతూ గ్రామంలోని 70 మంది పిల్లలకు విద్యా కానుక కిట్లను అందజేశామని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగంలో పెనుమార్పులు..

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో పెనుమార్పులు తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారని 28వ డివిజన్ కార్పొరేటర్ షేక్ షాహీనా అన్నారు. డివిజన్‌లోని మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్‌సాహెబ్, పాఠశాల హెచ్‌ఎంలు వీరబాబు, సుమంగళి, నాయకులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. నగరంలోని పలు డివిజన్లలోని మునిసిపల్ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి..

చల్లపల్లి: జగనన్న విద్యా కానుకను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ఉర్దూ పాఠశాలను నజరానా సందర్శించారు. మధ్యాహ్న భోజనం చేసి నాణ్యత పరిశీలించారు. చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణితో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్స్‌ను పంపిణీ చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు మండలంలో..

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఆవరణలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీపీ సంగా మధుసూదనరావుల చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, బత్తిన త్రినాథ్, కొల్లు వాసు, లింగం విజయ్‌కుమార్, హెచ్‌ఎం డి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా జేవీకే కిట్లను పంపిణీ చేశారు.

వెంకటాపురంలో..

వెంకటాపురం(మోపిదేవి): మండల పరిధిలోని వెంకటాపురం జెడ్పీ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను సర్పంచ్ తుమ్మా సోములమ్మ పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాల ఆవరణలో 51 మంది విద్యార్థులకు కిట్లను అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేస్‌బాబు, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ పేరుబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



బల్లిపర్రు గురుకుల పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న చారుమతి, వాణి తదితరులు



పెదపట్నంలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేసిన పెద వెంకయ్య తదితరులు



బందరులో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం

అల్పాదాయ వర్గాల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బ్రోచర్ అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఏటిమొగ(నాగాయలంక): రాష్ట్రంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర అల్పాదాయ వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. దీనిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు కుటిల ప్రచారంతో ఆయా వర్గాలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. నాగాయలంక మండలం తీరగ్రామం ఏటిమొగ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని 345 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల భరోసాకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేసి దేశంలోనే రికార్డు సృష్టించారని, ఇదే ఆయన పాలనా దక్షతకు నిదర్శనమని చెప్పారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది చిన్నారి, సర్పంచి నాయుడు దుష్యంతుడు, విశ్వనాథపల్లి నాగబాబు, నంద్యాల కోటేశ్వరరావు, తమ్ము సోమేశ్వరరావు, నాయుడు నాగబసవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ బుధవారం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని మంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మధ్యాహ్నం మూడు గంటలకు పెడన మార్కెట్ యార్డులో 11 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటర్ సైకిళ్లను పంపిణీ చేస్తారు. సాయంత్రం 4 గంటలకు రూ.95 లక్షలతో నూతనంగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు పాత పైడమ్మ కాలనీలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ లైన్లుకు విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తారు. నూతన పైడమ్మ జగనన్న లే అవుట్‌లో విద్యుత్ లైన్లకు విద్యుత్ సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వివరించింది.

కృత్తివెన్ను: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని మంత్రి కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు చినగొల్లపాలెం, లక్ష్మీపురం, పల్లెపాలెం, చెరుకుమిల్లి, గాంధీనగరం గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు.

గ్రామసభలకు అభ్యంతరాలు నిల్

పెడన: నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి మంగళవారం గ్రామ సభలను నిర్వహించారు. రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ పి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభల్లో పంచాయతీ కార్యదర్శులు అహ్మద్, మీరాలతో పాటు పెనుమల్లి, గురువిందగుంట గ్రామ సచివాలయాలకు చెందిన గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్ పాల్గొని గ్రామ సభలకు అవగాహన కల్పించారు. అసెస్‌మెంట్లకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేయడానికి ముందుకు రావాలని కోరారు. సాయంత్రం వరకు వేచి చూసినా గ్రామస్తుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని రీసర్వే డీటీ తెలిపారు. రీసర్వే ప్రక్రియను ఫైనలైజ్ చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

నేడు ఎస్‌కేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోడూరు: ప్రముఖ ఫార్మా కంపెనీ దివిస్ ల్యాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కోడూరులోని శ్రీకోట రాఘవయ్య (ఎస్‌కేఆర్) డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామని విద్యా సంస్థల గౌరవ సలహాదారు కోట వెంకట సుబ్బారావు మంగళవారం తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంఎస్సీ, ఎం.ఫార్మా పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రాంగణ ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో కళాశాలలో సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఎలా

ఎంపీపీ వాణి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: గత సమావేశంలో సభ్యులు పలు సమస్యలు చెప్పినప్పుడు వాటిని నమోదు చేసుకుని పరిష్కరించాలని సూచించామని, అయినా వాటిని పరిష్కరించకపోగా ఆ సమస్యలను మళ్లీ మొదటికి తీసుకురావడం ఏమిటంటూ ఎంపీపీ రాజులపాటి వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు సమస్యలు చెబితే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మీ స్థాయిలో పరిష్కరించగలిగేవైతే తక్షణం పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో మా దృష్టికి తీసుకువస్తే మంత్రి జోగి రమేష్ దృష్టిలో పెట్టి ఆయా సమస్యలను పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. అనంతరం పలు శాఖలపై సమీక్షించారు. వ్యవసాయ శాఖ వీఏఏ శిరిష మాట్లాడుతూ వరి విత్తనాలు బీపీటీ 73 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 వరి విత్తనాలు 130 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వీటిని రైతులకు సబ్సిడీపై ఇస్తున్నామని చెప్పారు. ఇంకా అవసరమైతే డిమాండ్‌ను బట్టి ఉన్నతాధికారులకు, ఏపీ సీడ్స్ వారికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. రైతులకు ఆర్‌బీకేల ద్వారా కాంప్లెక్స్ ఎరువులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఎంఈఓ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 4,570 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేస్తున్నామని వివరించారు. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. విద్యుత్ ఏఈ జయరాం మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలోలో ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు 220 కేవీ కోడూరు వద్ద మంజూరైందన్నారు. దీనిని ట్రాన్స్‌కో వారు రూ.48 కోట్లతో నిర్మిస్తున్నారని వివరించారు. విద్యుత్ స్తంభాల మార్పుపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో చెప్పినా అదే సమస్య మళ్లీ ఎందుకు చెప్పించుకుంటున్నారంటూ ప్రశ్నించారు. పరిష్కారం కాకపోతే మా దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు. సెబ్ సమీక్షలో కొంకేపూడి సర్పంచు దావు భైరవలింగం మాట్లాడుతూ కొంకేపూడి ప్రాంతంలో బెల్టు దుకాణాలు ఎనిమిది ఉన్నాయని, వాటిని అరికట్టాల్సిందిగా సెబ్ అధికారులను కోరారు. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, వైస్ ఎంపీపీ యాదం రెడ్డి వరప్రసాద్, వ్యవసాయ సలహా సంఘ చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

పేర్ని కిట్టు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని కానూరు గ్రామంలో నాలుగో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన పెదసింగు దుర్గ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో తమ కుటుంబానికి ప్రభుత్వపరంగా నాలుగు లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని, ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనని ఆనందం వ్యక్తం చేసింది. పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఏదో రూపేణా ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారన్నారు. పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హత ఉండి ప్రభుత్వం తరఫున ఎటువంటి సహాయం పొందని వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారి వివరాలను ప్రభుత్వానికి పంపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కలక్ష్మి, ఇన్‌చార్జి ఏడుకొండలు, ఉప సర్పంచ్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపతుల చూడామణి, గ్రామ పెద్దలు, గ్రామ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా డ్రెయిన్ పూడిక తీత

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట, ములపర్రు పంచాయతీల పరిధిలోని బందకోడు మైనర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, మట్టి, చెత్తాచెదారాల తొలగింపు పనులను రైతులు రెండు రోజులుగా స్వచ్ఛందంగా చేపట్టారు. సుమారు రూ. 50 వేల అంచనాలతో చేపట్టిన పూడిక తొలగింపు పనులు మంగళవారంతో ముగిశాయి. డ్రెయిన్ పరిధిలోని సుమారు 100 ఎకరాల రైతులు రానున్న సార్వా పంట నీటి పాలు కాకుండా మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. కాగా, డ్రెయిన్‌లోని పూడిక మట్టి తీసి బంటుమిల్లి–గుడివాడ రోడ్డుపై వేస్తున్నారు. డ్రెయిన్‌లోని మట్టిని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వేయడంతో వర్షం కురిస్తే రోడ్డు బురదమయం అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ, పంచాయతీ అధికారులు స్పందించి పూడిక మట్టి తరలించాలని కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు చేయూత

- 36 మంది విద్యార్థులకు రూ.4.50 లక్షలు
- శేషులు ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, కేర్ ట్రస్టు సాయం



విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ కాకర్ల విజయమాధురి

పామర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతలు సాయం అందించారు. సుమారు 36 మంది విద్యార్థులకు రూ.4.50 లక్షలను ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. రాపర్ల గ్రామానికి చెందిన శేషులు ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, కేర్ ట్రస్టు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పామర్రు హైస్కూలులో బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు, 9వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన మండల పరిధిలోని ఏడు జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 36 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతల సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ కాకర్ల విజయ మాధురి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు సాయం చేస్తే వారి భవిష్యత్‌కు మంచి ఆసరా అవుతుందని అన్నారు. తన తండ్రి కాకర్ల అర్జునరావు 70 ఏళ్ల క్రితం ఇదే పాఠశాలలో చదువుకున్నారని, దీనికి గుర్తుగా ఈ పాఠశాలతో పాటు మండలంలోని అన్ని హైస్కూళ్లలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నామని అన్నారు. తనతల్లి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ద్వారా గత మూడేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని తెలిపారు. పదో తరగతిలో పాఠశాలస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.10 వేలు, 9వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మండల పరిధిలోని ఏడు హైస్కూళ్లలో ఇంగ్లిషు, తెలుగు మీడియం విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాలను అందించారు.

జమీదగ్గుమిల్లి, కనుమూరు హైస్కూల్‌లలో ఇంగ్లిషు మీడియం లేని కారణంగా మిగిలిన వారికి అందించామని అన్నారు. విద్యార్థులు ఈ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇదే హైస్కూల్‌లో విద్యార్థులు కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యంతో ట్యాబ్‌ను ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ రాధిక, కోశాధికారి మాధవి, ట్రస్టు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, సభ్యులు కె.బలరామమూర్తి, కె.శివయ్య, పామర్రు హైస్కూల్ హెచ్‌ఎం బి.సురేష్, ఇతర హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

గుడివాడ టౌన్: మాదక ద్రవ్యాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక కేటీఆర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు–నష్టాలు అనే అంశంపై విద్యార్థులకు రెండో రోజు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ పి. జాషువ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాదక ద్రవ్యాలు వినియోగం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు నాశనం చేస్తాయన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీ ఉన్నతిని ఆశించి చదివిస్తారని దానిని విద్యార్థులు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకం, రవాణ వంటి చర్యలు చట్టరీత్యా నేరమని అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, హెరైన్ తదితర మత్తు పదార్థాలు అమ్ముతున్న వారి సమాచారం 14500 లేదా 100 నంబర్ ద్వారా పోలీసులకు తెలియచేసి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ తులసీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ గాయిత్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ రెడ్డయ్యకు సన్మానం

పెడన: నూతనంగా పెడన మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన వీరమల్లు రెడ్డయ్యను మంగళవారం మండల పరిషత్ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, వైస్ చైర్మన్ యాదంరెడ్డి వరప్రసాద్, అచ్యుతరావు, వెంకట రామానాయుడు, దావు భైరవలింగం. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ



గూడూరు: గూడూరులోని నాన్ భవిత కేంద్రాన్ని ఎంపీపీ సంగా మధుసూదనరావు మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని వసతులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో మాట్లాడిన ఎంపీపీ వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం విజయ్‌కుమార్, ఐఈఆర్పీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.